భయం..
భయంగా..
2





2
జాతీయ రహదారిపై
లారీ బోల్తా

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatodaynews.com

## బాధిత కుటుంబాలకు మేయర్ పరామర్శ



**అక్షరటుడే, ఇందూరు:** ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో మునిగి నగరానికి చెందిన ముగ్గురు యువకులు ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం బాధిత కటుంబాలను మేయర్ కూరగాయల ఉమారాణి పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా సంబంధిత అధికారులతో మాట్లాడి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మహమ్మద్ సమీ, అబ్దుల్ వహీద్, అబ్దుల్ ఖయ్యూం, షేక్ జాఫర్, షకీల్, వాహద్ ఉన్నారు.




## శ్రీరామ్ సాగర్‌కు కొనసాగుతున్న వరద



**అక్షరటుడే, మెండోరా :** ఉత్తర తెలంగాణ వరప్రదాయని శ్రీరామ్ సాగర్‌కు వరద కొనసాగుతోంది. మహారాష్ట్రలో, స్థానికంగా కురిసిన వర్షాలతో ప్రస్తుతం జలాశయంలోకి 27,680 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. శ్రీరామ్ సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 1,091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1,074.30 అడుగుల (31.3టీఎంసీల)కు చేరింది. గతేడాది ఇదే సమయంలో జలాశయంలో 38.9 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా పడటంతో నీటిమట్టం తక్కువగా ఉంది. ఎగువ నుంచి వరద కొనసాగుతుండటంతో ప్రాజెక్ట్ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. జలాశయంలో నీటిమట్టం పెరగడంతో పాటు వరద కొనసాగుతుండటంతో అధికారులు కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. కాకతీయ కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు వదులుతున్నారు. రానున్న రోజుల్లో భారీ వరద వస్తే ప్రాజెక్ట్ నిండుతుంది. ప్రతి ఏటా ఆగస్టు, సెప్టెంబర్‌లో జలాశయానికి భారీ వరద వస్తుంది. ప్రస్తుతం వరద కొనసాగుతుండటంతో ఆయకట్టు రైతులు పంటల సాగుకు సిద్ధం అవుతున్నారు. అన్ని కాలువల ద్వారా నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు.







# సంబరంగా ‘ఊరపండుగ’

- తరలి వచ్చిన భక్తులు
- సర్వ సమాజ్ ఆధ్వర్యంలో వైభవంగా సాగిన ఊరేగింపు
- మున్సిపల్ అధికారుల ఏర్పాట్లు
- ఆకట్టుకున్న పోతురాజుల విన్యాసాలు

**నగర ప్రజల ‘పులోరియా’ నినాదాల మధ్య.. సర్వసమాజ్ కమిటీ, రాజకీయ నాయకులు వెంట రాగా.. పోలీసు, కార్పొరేషన్ యంత్రాంగాల ఏర్పాట్ల నడుమ ఊరపండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవార్ల దేవతామూర్తలను ఖిల్లా శారదాంబ గద్దె నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తులు ‘సరి’కోసం పోటీపడ్డారు.**

**– అక్షరటుడే, నిజామాబాద్ సిటీ**

ఇందూరు నగరంలో ఊర పండుగను ఘనంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం వడ్ల ధాతి వద్ద అమ్మవార్ల దేవతామూర్తుల తయారీ ప్రక్రియను పూర్తిచేశారు. అనంతరం వాటికి భక్తితో పూజలు చేశారు. అక్కడి నుంచి సిర్నపల్లి గడిలో పూజలు నిర్వహించి ఆదివారం తెల్లవారుజామున ఖిల్లా ముఖద్వారం వద్ద ఉన్న శారదాంబ గద్దె మీదికి తీసుకొచ్చారు. ఉదయం 6గంటల ప్రాంతంలో వాటిని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుమారు 9 గంటల నుంచి అంగరంగ వైభవంగా ఊరేగింపు ప్రారంభమైంది.

### సర్వసమాజ్ కమిటీ, కుల సంఘాల ఆధ్వర్యంలో..

బండారు పోసిన అనంతరం ఊరపండుగ కార్యక్రమాలు నగరంలో ప్రారంభమయ్యాయి. సర్వసమాజ్ కమిటీ సభ్యులు, ఆయా కుల సంఘాల సభ్యులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అనంతరం ఉదయం ఊరేగింపులో పాల్గొన్నారు. ఖిల్లా శారదాంబ గద్దె వద్ద ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ గుప్తా, మేయర్ ఉమారాణి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ‘సరి’కోసం ప్రత్యేక ఏర్పాట్లు

పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ఊరేగింపు ప్రారంభమైన తర్వాత వివేకానంద చౌరస్తా వద్ద ‘సరి’ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 10 గంటల ప్రాంతంలో సరిని తయారుచేసిన భక్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా తోపులాట జరగగా.. పోలీసులు నియంత్రించారు.

### రెండు బృందాలుగా విడిపోయి..



ఖిల్లా శారదాంబ గద్దె నుంచి ప్రారంభమైన ఊరేగింపు గాజులపేట్ చౌరస్తా మీదుగా పెద్దబజార్ చౌరస్తా వరకు చేరుకుంది. పెద్దబజార్ చౌరస్తా నుంచి రెండు బృందాలుగా విడిపోయి డప్పు వాయిద్యాలు, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల మధ్య ఒక బృందం పొడలమ్మ, నల్ల పోచమ్మ, అడెల్లి పోచమ్మ, పులిరాజులు, రాట్నం, తొట్లెలతో దుబ్బ వైపు ఊరేగింపుగా వెళ్తుంది. మరోబృందం సిర్నాపల్లి గడి, గోల్ హనుమాన్ చౌరస్తా మీదుగా వినాయక్‌నగర్‌లోని చేతుల పోచమ్మ, మత్తడి పోచమ్మ, మహాలక్ష్మమ్మ ఆలయాలకు చేరుకుంది. ఈ రెండు బృందాలతోపాటు సరి (ప్రత్యేకంగా తయారు చేసిన ప్రసాదం)ని గుల్లల్లో నాలుగు భాగాలుగా విభజిస్తారు. ఈ ‘సరి’ని ఒకటి దుబ్బ వైపు, రెండోది వినాయక్‌నగర్ వైపు మూడోది ఎల్లమ్మగుట్ట, నాల్గవ గుల్ల కంఠేశ్వర్ వైపు చల్లుతూ వెళ్లారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్వసమాజ్ కమిటీ అధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, కన్వీనర్ రామర్తి గంగాధర్, కో కన్వీనర్ ఆదె ప్రవీణ్‌కుమార్, కమిటీ సభ్యులు గాండ్ల లింగం, బీజేపీ కార్పొరేటర్లు మల్కాయి మహేందర్, న్యాలం రాజు, కాంగ్రెస్ డీసీసీ నగర అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, నాయకులు రామర్తిగోపి, జనసేన నాయకుడు మీసాల శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.











## ఊర పండుగ బందోబస్తును పర్యవేక్షించిన పోలీస్ కమిషనర్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో ఊరపండుగ వేడుక అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పోలీస్‌శాఖ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. సీపీ సాయిచైతన్య బందోబస్తును పర్యవేక్షించారు. పండుగ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా , ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ ప్రక్రియను సీపీ సాయిచైతన్య క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఊరేగింపు నిర్వహించిన ప్రధాన ప్రాంతాలు, రద్దీ కూడళ్లు, ట్రాఫిక్ మళ్లింపు ప్రాంతాలు, పార్కింగ్ స్థలాలను సందర్శించి పోలీసు అధికారులు, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. భక్తుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ప్రతి సున్నిత ప్రాంతంలో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. సీపీ మాట్లాడుతూ.. పండుగకు భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశమున్నందున వారి భద్రతకు ప్రాధాన్యతనిచ్చామని పేర్కొన్నారుఅనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి తక్షణ చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు. నిజామాబాద్ సీసీఆర్బీ, సీసీఎస్, ఏసీపీ ప్రకాశ్ యాదవ్, గురు నాయుడు, శ్రీశైలం, ట్రాఫిక్ సీఐ శ్రీ ప్రసాద్, టౌన్ సీఐ శ్రీ శ్రీనివాసరాజ్, సౌత్ రూరల్ సీఐ, సురేష్ కుమార్ ఎస్‌హెచ్‌వో రఘుపతి, ఎస్సైలు పాల్గొన్నారు.

## అభివృద్ధే లక్ష్యంగా సుదర్శన్ రెడ్డి కృషి: బొబ్బిలి రామకృష్ణ




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ పేర్కొన్నారు. నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మేయర్ ఉమారాణి ఆధ్వర్యంలో సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ.. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ, ప్రజల సంక్షేమాన్నే తన కుటుంబంగా భావించి పనిచేసే గొప్ప వ్యక్తిత్వం గల నాయకుడు సుదర్శన్ రెడ్డి అని కొనియాడారు. అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ఆయన ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. గతంలో నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసిన కాలంలో అలీసాగర్, గుత్ప ఎత్తిపోతల పథకాలను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడంలో సుదర్శన్ రెడ్డి కీలక పాత్ర పోషించారన్నారు. నిజామాబాద్ ప్రాంతంలో మెడికల్ కాలేజీ ఏర్పాటుతో పాటు విద్యా, వైద్య రంగాల విస్తరణకు ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శరత్, రత్నాకర్ గౌడ్, కోశాధికారి భక్తవత్సలం, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ గౌడ్, యాదగిరి, విపుల్ గౌడ్జావీద్ అక్రమ్, రామర్తి గోపి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలు



**అక్షరటుడే, బాల్కొండ:** ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం బాల్కొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి సుదర్శన్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ప్రజా సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చాట్ల నరేష్, ప్రధాన కార్యదర్శి యునుస్, సంజీవ్ గౌడ్, సయ్యద్ మజారుద్దీన్, ఇమ్రాన్, అన్వర్, రవి, పద్మారావు, రాజేందర్, మల్లేష్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ మండల కేంద్రంలో సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు గడ్డం చిన్నారెడ్డి, జనరల్ జాయింట్ సెక్రెటరీ మగ్గిడి ముత్యం రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద పర్యాటకుల సందడి



**అక్షరటుడే, మెండోరా:** మెండోరా మండలంలోని శ్రీరాంసాగర్ (పోచంపాడు) ప్రాజెక్ట్ ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. ప్రాజెక్టులో వరద వస్తుండటంతో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఆదివారం సెలవు కావడంతో పర్యాటకులు భారీగా తరలి వచ్చారు. ప్రాజెక్టు పరిసరాల్లో కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి సందడి చేశారు. జలాశయం దిగువన గల పార్కులో సేద తీరారు. సరైన వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసులు, ప్రాజెక్టు భద్రతా సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించారు. డ్యామ్ దిగువ ప్రాంతాలకు ఎవరూ వెళ్లకుండా నిరోధిస్తూ, ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టారు. సందర్శకులు అధికారులు సూచించిన భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు.



గతేడాది ఇదేనెలలో కామారెడ్డిని ముంచెత్తిన వరదల జ్ఞాపకాలు ప్రజలను మళ్లీ వెంటాడుతున్నాయి. ఆకాశంలో మబ్బులు కమ్మగానే జీఆర్ కాలనీ, కౌండిన్య కాలనీ వాసుల గుండెల్లో దడ మొదలవుతోంది. పెద్ద చెరువు నీటిమట్టం పెరుగుతుండటంతో మరోసారి వరద వస్తుందేమోనన్న ఆందోళన కాలనీవాసుల్లో కనిపిస్తోంది.

– అక్షరటుడే, కామారెడ్డి

# భయం.. భయంగా..

- కామారెడ్డిని వెంటాడుతున్న వరద జ్ఞాపకాలు..
- గతేడాది వరదల్లో చిక్కుకున్న జీఆర్, కౌండిన్య కాలనీలు
- పెద్ద చెరువు నిండటంతో మరోసారి కాలనీవాసుల్లో ఆందోళన
- శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారుల విఫలం
- గత వరదల్లో రూ.కోట్లల్లో నష్టం

గతేడాది వినాయక చవితి రోజు కురిసిన అకస్మాత్తు భారీ వర్షాలకు కామారెడ్డి పట్టణం అతలాకుతలమైంది. గంటల పాటు కురిసిన వర్షానికి పట్టణం చుట్టూ నీరు నిలిచి ప్రజలు ఇళ్లలోనే చిక్కుకుపోయారు. ముఖ్యంగా పెద్ద చెరువు కింద ఉన్న జీఆర్ కాలనీ, కౌండిన్య కాలనీ పూర్తిగా జలమయమయ్యాయి. ఫర్నిచర్, ఇళ్లలోని సామగ్రి కొట్టుకుపోయి ప్రజలు రోడ్డున పడ్డారు. ఆ రోజు రాత్రంతా ప్రజలు భయంతో నిద్ర లేకుండా గడిపారు.

### శాశ్వత పరిష్కారం చూపని వైనం

ఏడాది గడిచినా ఆ గాయాలు ఇంకా మానలేదు. ఈసారి వర్షాలు మొదలవుతుండగానే మళ్లీ అదే పరిస్థితి వస్తుందేమోనన్న భయం వెంటాడుతోంది. అక్రమ కబ్జాలు, అక్రమ కట్టడాలు, మురుగు కాల్వల ఆక్రమణల వల్లనే పట్టణంలో వరద ముప్పు పెరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షం నీరు వెళ్లే దారులు మూసుకుపోవడంతో నీరంతా కాలనీల్లోకి చేరుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరదల తర్వాత అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయి పర్యటనలు చేసి, శాశ్వత పరిష్కారం చూపుతామని హామీలు ఇచ్చారు. కాలువలను వెడల్పు చేస్తామని, ఆక్రమణలను తొలగిస్తామని చెప్పారు. కానీ ఆచరణలో మాత్రం ఎలాంటి కార్యాచరణ కనిపించడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

### నిండుకుండలా పెద్ద చెరువు

గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కామారెడ్డి పెద్ద చెరువు ఇప్పటికే నిండుకుండను తలపిస్తోంది. మరికొన్ని రోజులు భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఏమిటని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. గతేడాది అంతా పోగొట్టుకున్నాం. ఈసారి కూడా అదే జరిగితే బతికేది ఎలా అని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద చెరువుతో పాటు చిన్నమల్లారెడ్డి చెరువు నిండితే చిన్నమల్లారెడ్డి, సరంపల్లి గ్రామాల నుంచి వచ్చే వరదలు పెద్ద చెరువు ప్రధాన కాలువలో కలుస్తుండటంతో వరద ఉధృతి పెరిగే అవకాశాలు ఉన్నాయి. గతేడాది వరదలకు కామారెడ్డి



పట్టణం తీవ్రంగా నష్టపోయింది. జీఆర్, కౌండిన్య కాలనీలతో పాటు పలు ప్రాంతాల్లో అనేక ఇళ్లు దెబ్బతిన్నాయి. వరదల్లో ముఖ్యమైన డాక్యుమెంట్లు, సర్టిఫికెట్లు, నగదు, బంగారం కోల్పోయారు. ఫ్రిజ్‌లు, టీవీలు, వాహనాలు, దుకాణాల్లోని సరుకులు నీట మునిగాయి.

### చర్యలు తీసుకునేనా..?

వరద ముప్పు రాకుండా డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేయడం, ఆక్రమణలను తక్షణం తొలగించడం, చెరువు కట్టలను బలోపేతం చేయడంతో పాటు శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే ప్రతి వర్షానికి భయపడుతూ బతకాల్సిన పరిస్థితి తప్పదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే అధికారులు శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

### మరమ్మతులు చేపట్టాం



గతేడాది వరదల దృష్ట్యా ఈ ఏడాది ముందస్తుగానే చర్యలు తీసుకున్నాం. వరదకు కారణమైన కాలువ మరమ్మతులు చేపట్టాం. ఎక్కడికక్కడ తూటి పొదలను యంత్రాల సహాయంతో తొలగించాం. వరదల సమయంలో తీసుకునే జాగ్రత్తలను కలెక్టర్ ఆదేశాలతో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో మాక్‌డ్రిల్ కూడా నిర్వహించాం. వరద బారిన పడకుండా మరోసారి కాలనీలో పర్యటించి తగిన చర్యలు తీసుకుంటాం.

**– ఇప్ప ఉమారాణి, మున్సిపల్ ఛైర్‌పర్సన్**

## మూల మలుపు కాదు.. మృత్యు మలుపు

- గుంతలతో దెబ్బతిన్న రామారెడ్డి మూల మలుపు
- వాహనదారుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



**అక్షరటుడే, కామారెడ్డి** కామారెడ్డి నుంచి రామారెడ్డికి వెళ్లే ప్రధాన రహదారిపై రామారెడ్డి చౌరస్తా వద్ద గంజ్ గేటు ఎదురుగా ఉన్న మూల మలుపు ఇప్పుడు మృత్యు మలుపుగా మారింది. సరిగ్గా మూల మలిగే ప్రాంతం పూర్తిగా గుంతలమయమై వాహనదారుల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. ఈ రోడ్డు సిరిసిల్లకు వెళ్లే ప్రధాన మార్గం కావడంతో నిత్యం వందలాది బస్సులు, లారీలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు తిరుగుతుంటాయి. రోడ్డుపై ఏర్పడిన పెద్ద గుంతల్లో వర్షపు నీరు నిలవడంతో డ్రైవర్లకు అవి కనిపించడం లేదు. వేగంగా వచ్చే వాహనం ఒక్కసారిగా గుంతలోకి దిగితే అదుపు తప్పి కింద పడే ప్రమాదం పొంచి ఉంది. ముఖ్యంగా స్కూల్ పిల్లలు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించేటప్పుడు తీవ్ర భయంతో సాగుతున్నారు. రహదారి ప్రమాదకరంగా మారిందని తెలిసినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రమాద తీవ్రతను అంచనా వేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని, ఏదైనా పెద్ద ప్రమాదం జరిగిన తర్వాతనా స్పందిస్తారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వెంటనే గుంతలను పూడ్చి రోడ్డును మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## మినీ స్టేడియం ఓపెన్ జిమ్ లో స్వచ్ఛ భారత్..




**అక్షరటుడే, ఆర్మూర్ :** పట్టణంలోని మినీ స్టేడియంలో గల ఓపెన్ జిమ్ ఆవరణలో ఆదివారం ఆర్మూరు మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిమ్‌లో పెరిగిన పిచ్చిమొక్కలు, పేరుకుపోయిన చెత్త చెదారాన్ని, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శుభ్రపరిచారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.... ప్రతి రోజు ఎంతో మంది ఈ జిమ్లో వ్యాయమాలు చేస్తుంటారని వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా జిమ్ ఆవరణ మొత్తం శుభ్రం చేశామన్నారు. ప్రతి వారం ఒక గంట అనే నినాదంతో 65 వారాలుగా ఈ స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే మా ధ్యేయమని ఇందుకోసం ఈ స్వచ్ఛ కార్యక్రమాన్ని నిర్విరామంగా కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యాదయ్య, ఉపాధ్యాయుడు శ్రీనివాస్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు సుంకె నిశాంత్, బొగడమీది ప్రశాంత్, వేద రాజ్ కుమార్, శ్యాంసుందర్, డ్రైవింగ్ స్కూల్ వేణు, చోల మండల్ రాకేష్, కుతాడి ఎల్లయ్య, నరేంధర్, రమేష్, రాహుల్ రాజ్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై లారీ బోల్తా



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న ఓ భారీ కంటైనర్ లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటన డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి గ్రామం వద్ద ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగ్‌పూర్ నుంచి స్పేర్‌పార్ట్స్ సామగ్రి లోడుతో బెంగళూరు వైపు వెళ్తున్న ఓ భారీ కంటైనర్ లారీ 44వ నంబర్ జాతీయ రహదారిపై సుద్దపల్లి గ్రామం వద్దకు రాగానే ఒక్కసారిగా అదుపు తప్పి పక్కనే ఉన్న సర్వీస్ రెయిలింగ్‌పై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ సురక్షితంగా స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కంటైనర్ లారీ సర్వీస్ రోడ్డును ఆనుకుని ఉన్న ఇనుప విద్యుత్ స్తంభంపై బోల్తా పడింది. ప్రమాదం జరిగిన సమయంలో విద్యుత్ సరఫరా ఉంది. అయితే లారీ స్తంభాన్ని ఢీకొట్టిన వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో భారీ ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు.

## ఆర్మూర్ లో ఘనంగా బోనాల పండుగ



**అక్షర టుడే, ఆర్మూర్:** ఆర్మూర్ పట్టణంలోని శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆదివారం ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అన్ని రకాల వసతులను కల్పించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం పెద్ద బజార్ అధ్యక్షుడు బోండ్ల పెద్దలు, రాజారాం నగర్ సంఘం అధ్యక్షుడు జంగిడి భోజన్న, ఆలయ కమిటీ అధ్యక్షుడు గాజం మచ్చేందర్, ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## అమ్దాపూర్‌లో బోనాల పండుగ



**అక్షరటుడే, బోధన్:** ఆషాఢమాసంలో ఊరూరా బోనాల పండుగ సంబురాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండలంలోని అమ్దాపూర్‌లో గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో బోనాలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలు ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బోనాలు సమర్పించారు. వర్షాలు బాగా కురిసి పాడిపంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోరెడ్డి గంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పల్లెన్న పాల్గొన్నారు.